


EVENING EDITION
నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
ఆదివారం
07-12-2025
పేజీలు: 02

## దళితమహిళకు పోలీసు వేధింపులు!




వేధిస్తున్నాడు, న్యాయం చేయండని వేడుకున్న మహిళకు ఇదో కొత్తరకం వేధింపులు. గౌరవప్రదమైన వృత్తిలో ఉన్న అధికారి మరీ నీచపు పనికి దిగజారిన దుస్థితి. ఒంటరి మహిళ అని కూడా చూడకుండా, మానసికంగా కుంగిపోతున్న ఆమె దయనీయ స్థితిని పట్టించుకోకుండా 'కోరిక'ను బయటపెట్టుకుని దిగజారిన ఖాకీ వైనం. కేసు పెట్టాలంటే పేచీ పెట్టకుండా ఒంటరిగా రావాలి., ఫిర్యాదు పట్టించుకోవాలంటే 'కనీసంగా లాలించాలి' అని బుద్ధి బయటపెట్టి తన కరుడుగట్టిన కాఠిన్యాన్ని చూపిన ఆఫీసర్ వక్రమిది. పేరుకే ఫ్రెండ్లీ పోలీసింగ్ తప్ప మా తరీఖా మారదు, ఎన్ని గుణపాఠాలు చెప్పినా మా 'అక్రమ బుద్ధి తీరదు' అన్నట్టుగా వ్యవహరించి శాఖకే మచ్చగా మారిన ఆ పోలీస్ ఆఫీసర్ ఉదంతం చర్చనీయాంశమైంది.

## గోవాలో అర్ధరాత్రి ఘోర అగ్ని ప్రమాదం

# 23 మంది మృతి

గోవాలో ఘోర అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. నార్త్ గోవాలోని ఒక నైట్ క్లబ్‌లో శనివారం అర్ధరాత్రి సిలిండర్ పేలి మంటలు చెలరేగాయి. ఈ దుర్ఘటనలో 23 మంది ప్రాణాలు కోల్పోయారు. చనిపోయిన వారిలో ఎక్కువ మంది క్లబ్‌లోని కిచెన్ సిబ్బంది ఉన్నారు. వీరిలో ముగ్గురు మహిళలు కూడా ఉన్నారు. మరణించిన 23 మందిలో నలుగురు పర్యాటకులు ఉన్నట్లు ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ తెలిపారు. అగ్ని ప్రమాదం గురించి తెలిసిన వెంటనే ముఖ్యమంత్రి సావంత్ సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మరణించిన 23 మందిలో ముగ్గురు తీవ్ర గాయాలతో మరణించారని, మిగిలినవారు ఊపిరాడక చనిపోయారని తెలిపారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, ఆ నైట్ క్లబ్ ఫైర్ సేఫ్టీ నిబంధనలను పాటించలేదని, అందువల్లే ప్రమాద తీవ్రత పెరిగినట్లు ఆయన ఆరోపించారు.క్లబ్ యాజమాన్యంపై, అలాగే భద్రతా నిబంధనలను ఉల్లంఘించి క్లబ్ నిర్వహించడానికి అనుమతించిన అధికారులపై చర్యలు తీసుకుంటామని సావంత్ తెలిపారు. మరో 25 రోజుల్లో నూతన సంవత్సరం రాబోతున్న తరుణంలో ఇలా జరగడం చాలా దురదృష్టకరమని అన్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకుంటామని ముఖ్యమంత్రి తెలిపారు.ఈ అగ్నిప్రమాదం శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత 'Birch by Romeo Lane' అనే క్లబ్‌లో జరిగింది. ఇది అర్పోరా గ్రామంలో ఉంది. రాజధాని పనాజీకి సుమారు 25 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ పాపులర్ పార్టీ వేదిక ఇది. గతేడాది దీన్ని ప్రారంభించారు. గోవా పోలీస్ చీఫ్ ఆలోక్ కుమార్ మాట్లాడుతూ, సిలిండర్ పేలుడు వల్లే ఈ అగ్నిప్రమాదం సంభవించిందని తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. మరణించిన 23 మంది



మృతదేహాలను క్లబ్ ప్రాంగణం నుండి వెలికితీసి, బాంబోలిమ్‌లోని ప్రభుత్వ మెడికల్ కాలేజీకి తరలించినట్లు స్థానిక బీజేపీ ఎమ్మెల్యే లోబో వెల్లడించారు. అగ్నిమాపక సిబ్బంది, పోలీసు బృందాలు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని రాత్రంతా సహాయక చర్యలు చేపట్టినట్లు ఆయన తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రమాదాలు జరగకుండా చూసుకుంటామని.. అన్ని క్లబ్‌లలో ఫైర్ సేఫ్టీ ఆడిట్ నిర్వహిమన్నారు. ఈ ప్రమాదం గోవాలో పర్యాటకులను, స్థానికులను తీవ్రంగా కలచివేసింది. భద్రతా ప్రమాణాలపై అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

**గోవా అగ్నిప్రమాదంపై రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ విచారం.. ఎక్స్‌గ్రేషియా ప్రకటన**

గోవాలోని ఓ ప్రముఖ నైట్‌క్లబ్‌లో ఘోర అగ్నిప్రమాదం జరిగి 25 మంది ప్రాణాలు కోల్పోయారు. మరో 50 మంది తీవ్రంగా గాయపడ్డారు. ఉత్తర గోవాలోని అర్పోరా ప్రాంతంలో ఉన్న బిర్చ్ నైట్‌క్లబ్‌లో శనివారం అర్ధరాత్రి గ్యాస్ సిలిండర్ పేలడంతో ఈ దుర్ఘటన చోటుచేసుకుంది. ఈ ఘటనపై రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు.

క్లబ్‌లో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఒక్కసారిగా మంటలు వ్యాపించాయి. మృతుల్లో 16 మంది క్లబ్ సిబ్బంది, ముగ్గురు మహిళలు, నలుగురు పర్యాటకులు ఉన్నారు. కొందరు మంటల్లో చిక్కుకుని మరణించగా, ఎక్కువ మంది దట్టమైన పొగ కారణంగా ఊపిరాడక ప్రాణాలు కోల్పోయినట్లు అధికారులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంపై ప్రధాని మోదీ స్పందిస్తూ, ఇది చాలా బాధాకరమైన సంఘటన అని అన్నారు. గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్‌తో ఫోన్‌లో మాట్లాడి పరిస్థితిని సమీక్షించినట్లు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం బాధితులకు అవసరమైన అన్ని సహాయక చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షలు, గాయపడిన వారికి రూ. 50 వేల చొప్పున ఎక్స్‌గ్రేషియా ప్రకటించారు. రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము కూడా ఈ దుర్ఘటనపై విచారం వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం తనను తీవ్రంగా కలచివేసిందని, మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలియజేస్తున్నానని 'ఎక్స్' వేదికగా పేర్కొన్నారు.

## గోవాకు వెళ్ళే జంటలు జాగ్రత్త!



ప్రేమ జంటలు గోవా పర్యటనకు వెళ్లేటప్పుడు ఎంతో అప్రమత్తంగా ఉండాలని సూచించేలా హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన ఒక బ్లాక్‌మెయిల్ ఘటన వెలుగులోకి వచ్చింది. ముఖ్యంగా తాత్కాలిక బస కోసం ఎంచుకునే హోటళ్లు లేదా ప్రైవేట్ అకామిడేషన్స్ విషయంలో అత్యంత జాగ్రత్త అవసరమని ఈ ఉదంతం స్పష్టం చేస్తోంది. వివరాల్లోకి వెళితే... హైదరాబాద్‌లోని ఎర్రగడ్డ ప్రాంతానికి చెందిన 35 ఏళ్ల మహిళ తన పెళ్లికి ముందు అంటే 2023లో తన ప్రియుడితో కలిసి గోవాకు పర్యటనకు వెళ్లింది. ఆ సమయంలో వారికి బస, ప్రయాణ ఏర్పాట్లు సహా ఇతర సేవలను యశ్వంత్ అనే వ్యక్తి అందించాడు. ఈ వ్యక్తి గోవాలో హోటల్, సర్వీస్ అపార్ట్‌మెంట్‌ల నిర్వహణ, సమన్వయ బాధ్యతలు చూసుకునేవాడు. అయితే.. ఇటీవల కాలంలో సదరు మహిళకు యశ్వంత్ నుంచి ఊహించని ఫోన్ కాల్ వచ్చింది. గతాన్ని ఆసరాగా చేసుకొని యశ్వంత్ ఆమెను బ్లాక్‌మెయిల్ చేయడం ప్రారంభించాడు. గతంలో గోవాలో ఉన్న సమయంలో ఆ జంట సన్నిహితంగా ఉన్న ప్రైవేట్ వీడియోలను రహస్యంగా చిత్రీకరించానని యశ్వంత్ బెదిరించాడు. ఈ వీడియోలను సోషల్ మీడియాలో, ఆ మహిళ భర్తకు పంపిస్తానని బెదిరిస్తూ వాటిని బయటపెట్టకుండా ఉండాలంటే ఏకంగా రూ. 30 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ప్రస్తుతం ఆ మహిళకు వేరే వ్యక్తితో పెళ్లై.. సంతోషకరమైన వైవాహిక జీవితాన్ని కొనసాగిస్తోంది. ఈ దశలో తన గతం బయటపడితే తన వైవాహిక జీవితం పూర్తిగా చెడిపోతుందని తనను వదిలేయమని డబ్బులు అడగవద్దని యశ్వంత్‌ను వేడుకుంది. అయినప్పటికీ, యశ్వంత్ ఆమె మాట వినిపించుకోకుండా బెదిరింపులు కొనసాగించడమే కాక, ఆమెపై మరింత ఒత్తిడి తేవడం ప్రారంభించాడు. యశ్వంత్ బెదిరింపులు రోజురోజుకూ పెరగడంతో వేరే దారి లేక బాధిత మహిళ న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించింది. ఈ ఘటనపై ఆమె సనత్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు. ఐపీసీ సెక్షన్ల కింద బ్లాక్‌మెయిల్, బెదిరింపులకు పాల్పడిన యశ్వంత్‌పై కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు. గోవాలో జరిగిన ఈ ఘటనకు సంబంధించి సాక్ష్యాలను, నిందితుడి ఆచూకీని సేకరించే పనిలో సనత్‌నగర్ పోలీసులు నిమగ్నమయ్యారు. గోవా లేదా ఇతర పర్యాటక ప్రాంతాలకు వెళ్లే జంటలు ప్రైవేట్ బస ఎంచుకునేటప్పుడు, వ్యక్తిగత గోప్యత విషయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను ఈ ఘటన నొక్కి చెబుతోంది.

## విశాఖపట్నంలో ఘోరం.. మహిళ దారుణ హత్య




విశాఖపట్నంలో ఓ మహిళ దారుణ హత్యకు గురయ్యారు. ఈ హత్యకు సంబంధించిన వివరాలను విశాఖపట్నం పోలీసులు మీడియాకు వెల్లడించారు. చినముషీడివాడకు చెందిన శ్రీనివాస్‌తో విజయనగరానికి చెందిన దేవి సహజీవనం చేస్తున్నారు. తాము భార్యభర్తలమని చెప్పి శ్రీనివాస్, దేవి వేపగుంట అప్పన్నపాలెంలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఫ్లాట్ అద్దెకు తీసుకున్నారు. నిన్న(శనివారం) ఇద్దరి మధ్య ఘర్షణ తలెత్తిందని...ఈ క్రమంలో వాగ్వాదం పెరగడంతో ఐరన్ కుర్చీతో దేవిపై శ్రీనివాస్ దాడి చేసి హత్య చేశారని వెల్లడించారు. అపార్ట్‌మెంట్‌కు వచ్చిన ప్రతిసారి ఎవరి కంట కనపడకుండా హెల్మెట్ ధరించి వెళ్తుండేవారని మహిళా వాచ్‌మెన్ తెలిపారని అన్నారు. దేవి అరుపులు, కేకలు వినపడటంతో వెంటనే వాచ్‌మెన్ అపార్ట్‌మెంట్‌కు వెళ్లి ఆరా తీశారని వివరించారు. కుటుంబ సమస్య అని చెప్పడంతో తిరిగి మహిళా వాచ్‌మెన్ వెనక్కు వచ్చేశారని అన్నారు. అయితే, శ్రీనివాస్ కాసేపటికే అక్కడ నుంచి వెళ్లిపోయారని తెలిపారు. ఫ్లాట్‌కు తాళం వేసి ఉండటంతో తలుపులు కొట్టి దేవిని వాచ్‌మెన్ పిలిచారని.. ఇంట్లో నుంచి ఎలాంటి స్పందన లేకపోవడంతో వెంటనే తమకు మహిళా వాచ్‌మెన్ ఫిర్యాదు చేశారని పేర్కొన్నారు. తాము తలుపులు పగలకొట్టి ఇంట్లోకి వెళ్లి చూడగా రక్తపు మడుగులో దేవి పడి ఉన్నారని తెలిపారు.




## కొనసాగుతున్న ఇండిగో విమానాల రద్దు

ఇండిగో విమానాల రద్దు సమస్య పూర్తిగా తొలగిపోలేదు. ఇవాళ కూడా పలు ఎయిర్‌పోర్టులలో ఆ సంస్థ విమానాల రద్దు కొనసాగుతోంది. ముంబై నుంచి కోల్‌కతా, నాగ్‌పూర్, భోపాల్ వెళ్లే మూడు విమానాలు నిలిచిపోయాయి. మరోవైపు శ్రీనగర్ నుంచి అమృత్‌సర్‌కు వెళ్లాల్సిన రెండు విమానాలు, తిరుచ్చిలో ఐదు అర్రైవల్స్, ఆరు డొమెస్టిక్ డిపార్చర్ విమానాలను కూడా ఇండిగో రద్దుచేసింది. తిరువనంతపురం, ఢిల్లీ ఎయిర్‌పోర్టుల నుంచి కూడా ఆ విమానాలు రద్దయ్యాయి. బెంగళూరులో 76 అర్రైవల్స్, 74 డిపార్చర్‌లు కలిపి 150 విమానాలు నిలిచిపోయాయి. ఇక హైదరాబాద్‌లో ఏకంగా 100కు పైగా విమానాలు ఆగిపోయాయి. రైల్వే శాఖ ముంబై ఎయిర్‌పోర్టులో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌ను ఏర్పాటు చేసింది. ఇది ప్రయాణికులకు ప్రత్యామ్నాయ ప్రయాణ ఏర్పాట్లు, టికెట్ బుకింగ్స్‌లో సాయం చేస్తోంది. ఇవాళ దాదాపు 1500 విమాన సర్వీసులు నడపనున్నట్లు ఇండిగో అంచనావేసింది. ఇండిగో మాతృసంస్థ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ రంగంలోకి దిగి సంక్షోభ నివారణకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటుచేసింది. మరోవైపు డీజీసీఏ కూడా విమానాల సంక్షోభ వ్యవహారాన్ని ఇప్పటికే చాలా సీరియస్‌గా తీసుకుంది. సీఈవో, సీవోవోలకు షోకాజ్ నోటీసులు జారీ చేసింది. ఆ సంస్థ సీఈవో పీటర్ ఎల్బెర్స్ తన విధి నిర్వహణలో విఫలమైనట్లు పేర్కొంది. ఆ సంస్థ ప్లానింగ్‌లో కూడా వైఫల్యం చెందినట్లు డీజీసీఏ అభిప్రాయపడింది.



## రీతూచౌదరి ఎలిమినేట్?

తెలుగు బిగ్‌బాస్ సీజన్-9 రసవత్తరంగా కొనసాగుతోంది. ఈ వారం రీతూ చౌదరి ఎలిమినేట్ అయినట్లు తెలిసింది. నామినేషన్లలో ఆరుగురు ఉండగా.. నలుగురు సేఫ్ అయ్యారని సమాచారం. చివరికి సుమన్ శెట్టి, రీతూ చౌదరి మధ్య తీవ్ర పోటీ నెలకొనగా.. సుమనే ఎలిమినేట్ అవుతారని భావించారు. అయితే తక్కువ ఓటింగ్ రావడంతో అనూహ్యంగా రీతూ ఎలిమినేట్ అయినట్లు తెలుస్తోంది. ఆదివారం టెలికాస్ట్ అయ్యే ఎపిసోడ్‌లో ఎలిమినేషన్‌పై క్లారిటీ రానుంది.



## జాన్వీ హాట్ లుక్స్

తెలుగులో చేసిందే ఒక్క సినిమా.. కానీ కావాల్సినంత గుర్తింపు తెచ్చుకున్నారు జాన్వీ కపూర్. దేవర సినిమాలో తంగం పాత్రతో బాగానే చేరువయ్యారు ఈ బ్యూటీ. ప్రస్తుతం రామ్ చరణ్ పెద్ది సినిమాలో నటిస్తున్నారు. బాలీవుడ్ కంటే తెలుగులోనే ఈ భామకు మంచి ఆఫర్స్ వస్తున్నాయి. పెద్దితో టాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ లిస్టులో చేరిపోవాలని చూస్తున్నారు జాన్వీ.తెలుగులో ఎలా ఉన్నా.. హిందీలో మాత్రం ఇప్పటికీ స్ట్రగ్లింగ్ స్టేజ్‌లోనే ఉన్నారు జాన్వీ.అక్కడ ఎంట్రీ ఇచ్చి ఏడేళ్లు దాటినా.. ఇప్పటికీ ఒక్క హిట్ అంటూ వేచి చూస్తూనే ఉన్నారు జాన్వీ. గుంజన్ సక్సేనా, రూహీ లాంటి ఒకటి రెండు సినిమాలు పేరు తెచ్చాయి కానీ స్టార్ హీరోయిన్ హోదా మాత్రం తీసుకురాలేదు.మొన్నొచ్చిన పరమ్ సుందరి సైతం ఫ్లాపే.కాంట్రవర్సీల మధ్య విడుదలైన పరమ్ సుందరికి అవేం పెద్దగా హెల్ప్ అవ్వలేదు. కలెక్షన్స్ 50 కోట్లు కూడా దాటలేదు.ప్రస్తుతం వరుణ్ ధావన్‌తో సన్నీ సంస్కారిలో నటిస్తున్నారు జాన్వీ. ఈమె కెరీర్‌కు అత్యంత కీలకంగా మారింది ఈ చిత్రం. ఇక పెద్ది హిట్టైతే జాన్వీ కెరీర్‌కు తెలుగులో తిరుగులేనట్లే.. వరసగా ఆఫర్స్ క్యూ కడతాయి.

నేటి దినపత్రిక సూర్య www.suryaa.com EVENING EDITION 4PM

# అందాల సెగలు

అందాల ముద్దుగుమ్మ మృణాల్ ఠాకూర్ గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన పని లేదు.ఈ అమ్మడు తన అంద చందాలతో ఎంతో మంది మదిని దోచుకుంది. తాజాగా ఈ బ్యూటీ బ్లాక్ డ్రెస్‌లో  తన అంద చందాలతో అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం దీనికి సంబంధించిన ఫొటోస్ నెట్టింట తెగ వైరల్ అవుతున్నాయి.సీతారామం మూవీతో టాలీవుడ్ అభిమానుల ఫేవరెట్ అయిపోయింది ఈ బ్యూటీ. ఈ సినిమాతో మంచి గుర్తింపు తెచ్చుకొని వరసగా సినిమా ఆఫర్స్ అందుకుంది. తర్వాత ఫ్యామిలీ స్టార్, హాయ్ నాన్న పలు సినిమా చేసి తన కంటూ స్పెషల్ ఇమేజ్ క్రియేట్ చేసుకుంది.బుల్లితెరపై సీరియల్ ద్వారా మంచి ఫేమ్ సంపాదించుకున్న ఈ ముద్దుగుమ్మ తన క్యూట్ నెస్‌తో ప్రతి ఒక్కరినీ ఆకట్టుకుంది. సీరియల్ ద్వారా మంచి ఫేమ్ సంపాదించుకొని,సిల్వర్ స్క్రీన్ పైకి అడుగు పెట్టి తన నటనతో ప్రతి ఒక్కరి మనసు దోచుకుంది.



# ఏ దేశం ఒంటరి కాదు.... అమెరికాకు చైనా మెసేజ్




రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ భారత పర్యటనపై స్పందించిన చైనా ప్రభుత్వ మీడియా.. ఇది ప్రపంచ దేశాలకు ఒక స్పష్టమైన సందేశమని అభివర్ణించింది. ఏ దేశమూ ఒంటరి కాదని ప్రపంచానికి ఈ పర్యటన చాటిచెప్పిందని పేర్కొంది. ఉక్రెయిన్ సంక్షోభం తర్వాత రష్యాపై అమెరికా సహా పశ్చిమ దేశాల ఆంక్షలు కొనసాగుతున్న నేపథ్యంలో.. చైనా చేసిన ఈ ప్రకటన అంతర్జాతీయ రాజకీయాల్లో కీలక పరిణామంగా మారింది. రష్యా-భారత్ సంబంధాలు అత్యంత వ్యూహాత్మకమైనవని.. బయటి నుంచి వచ్చే ఒత్తిడికి తట్టుకుని నిలబడే శక్తి ఈ రెండు దశాలకు ఉందని చైనా విదేశాంగ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ లి హైడాంగ్ వ్యాఖ్యానించారు. పుతిన్ పర్యటన ద్వారా.. భారత్, రష్యా దేశాలు పరస్పర మద్దతుతో తమ స్వతంత్ర సామర్థ్యాలను బలోపేతం చేసుకుంటున్నట్లు.. ప్రపంచానికి సంకేతం పంపించాయని ప్రొఫెసర్ లి హైడాంగ్ తెలిపారు. ఈ బలమైన బంధం కారణంగానే రష్యా, భారత్ దేశాలపై.. అమెరికాతోపాటు పశ్చిమ దేశాల ఆంక్షలు, ఒత్తిడి విజయం సాధించలేవని ఆయన ధీమా వ్యక్తం చేశారు. భారత్, రష్యా దేశాల మధ్య పెరుగుతున్న స్వేచ్ఛాయుత విధానానికి ఇది నిదర్శనమని.. చైనా మీడియా వెల్లడించింది. రష్యా, భారత్‌ల మధ్య సమన్వయం, సహకారం చూస్తుంటే.. ఆ రెండు దేశాలు తమ స్వతంత్ర, స్వయంప్రతిపత్తి గల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసుకోవాలనే స్పష్టమైన ఉద్దేశాన్ని కలిగి ఉన్నాయని అర్థం అవుతోందని ప్రొఫెసర్ లి హైడాంగ్ స్పష్టం చేశారు. ఏ దేశమూ ఒంటరి కాదని.. పుతిన్ పర్యటన ద్వారా భారత్, రష్యాలు.. ఒక స్పష్టమైన సంకేతాన్ని అంతర్జాతీయ సమాజానికి పంపించాయని తెలిపారు. ప్రస్తుతం భారత్, రష్యా పరస్పరం మద్దతు పలుకుతుండటం.. బలమైన బంధం కలిగి ఉండటం వల్ల.. అమెరికా, పశ్చిమ దేశాల ఆంక్షలు లేదా ఒత్తిడి వాటి ముందు విజయం సాధించడం అసాధ్యమని ప్రొఫెసర్ హైడాంగ్ తేల్చి చెప్పారు. రష్యా-భారత్ బంధం బలంగా ఉన్నప్పటికీ.. భారత్‌తో సంబంధాలను మెరుగుపరుచుకోవడానికి అమెరికా కూడా ప్రయత్నాలు కొనసాగిస్తోందని చైనా అభిప్రాయం వ్యక్తం చేసింది. ఇండో-పసిఫిక్ ప్రాంతంలో తలెత్తే ముప్పును ఎదుర్కోవడంలో భారత్ భాగస్వామ్యం ఆవశ్యకతను.. అమెరికా తాజా జాతీయ భద్రతా వ్యూహం నివేదిక తేల్చి చెప్పింది. అదే సమయంలో ఆస్ట్రేలియా, జపాన్, అమెరికాతో కలిసి భారత్ క్వాడ్రిలేటరల్ సహకారాన్ని (క్వాడ్) కొనసాగించేందుకు.. వాణిజ్య సంబంధాలను మెరుగుపరుచుకోవాల్సిన అవసరం ఉందని ఆ రిపోర్ట్ పేర్కొంది. అమెరికాకు ప్రధాన ప్రత్యర్థి అయిన పుతిన్ భారత్‌లో పర్యటిస్తున్న సమయంలోనే.. అమెరికా డిప్యూటీ ట్రేడ్ రిప్రజెంటేటివ్ రిక్ స్విట్జర్ నేతృత్వంలోని ట్రంప్ పరిపాలన బృందం వాణిజ్య ఒప్పందంపై చర్చలు కొనసాగించడానికి వచ్చే వారం భారత్‌కు రానుందని బ్లూమ్‌బెర్గ్ నివేదిక తెలిపింది. ఇది రెండు దేశాల మధ్య గతంలో ఉన్న సుంకాలు, వాణిజ్య విభేదాలను పరిష్కరించడానికి చేస్తున్న ప్రయత్నాలను సూచిస్తుందని పేర్కొంది. ఒకవైపు చారిత్రక రక్షణ మిత్రదేశమైన రష్యాతో బంధాన్ని బలోపేతం చేస్తూనే.. మరోవైపు ఇండో-పసిఫిక్ భద్రత కోసం అమెరికా నేతృత్వంలోని క్వాడ్ కూటమిలో పాల్గొంటున్న భారత స్వతంత్ర విదేశాంగ విధానాన్ని పుతిన్ పర్యటన, చైనా వ్యాఖ్యలు ప్రపంచానికి ఒక కీలక సందేశాన్ని ఇస్తున్నాయి.

# ఏపీలో ఆ కొత్త రైల్వే లైన్ తో బెంగళూరుకు త్వరగా వెళ్లొచ్చు



శ్రీసత్యసాయి జిల్లా మడకశిర నియోజకవర్గంలో దశాబ్దాలుగా ఉన్న వెనుకబాటుతనం తొలగిపోనుంది. కనీస సౌకర్యాలు, అరకొర రవాణా వ్యవస్థతో పాటు అభివృద్ధి అంతంతమాత్రంగా ఉన్న ఈ ప్రాంతానికి.. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిష్కారం చూపుతోంది. కొత్త రైల్వే లైన్, రైల్వే స్టేషన్ నిర్మాణ పనులు వేగంగా జరుగుతున్నాయి. 80 కిలోమీటర్ల దూరంలోనే బెంగళూరు విమానాశ్రయం ఉండటం పరిశ్రమల ఏర్పాటుకు దోహదపడుతోంది. మునుపెన్నడూ లేని విధంగా మడకశిర ముఖచిత్రం మారబోతోంది. ఇన్నాళ్లూ వెనుకబడిన మడకశిర నియోజకవర్గం ఇప్పుడు అభివృద్ధి బాట పట్టనుంది. ఈ అభివృద్ధి పనుల వల్ల మడకశిర రూపురేఖలు పూర్తిగా మారనున్నాయి. ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయి. కొత్త ఉద్యోగ అవకాశాలు కూడా పెరుగుతాయి. మడకశిరకు రైలు రాబోతోంది.. 2011లో రాయదుర్గం-తుమకూరు రైల్వేలైను నిర్మాణం రూ.1,050 కోట్ల వ్యయంతో ప్రారంభమైంది. అయితే ఈ రైల్వే లైన్‌కు సంబంధించి వ్యయం కూడా పెరిగింది.. మొత్తం రూ.2,496 కోట్లతో పనులు చేపట్టారు. మడకశిరకు వచ్చే ఏడాది డిసెంబరులోపు రైలు తీసుకువస్తామని కేంద్రమంత్రి సోమన్న చెబుతున్నారు. ఆయనే స్వయంగా మూడుసార్లు ఈ రైల్వే లైన్ పనుల్ని పరిశీలించారు.. పనులు వేగవంతం చేయాలని సూచించారు. కొత్త రైల్వేస్టేషన్ నిర్మాణం హరేసముద్రం సమీపంలో వేగంగా జరుగుతోంది. ఈ రైలు మార్గంలో.. రాయదుర్గం, కళ్యాణదుర్గం, పావగడ, మడకశిర, తుమకూరు, బెంగళూరుకు ఈజీగా వెళ్లొచ్చు. మడకశిర సమీపంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రోత్సాహంతో రక్షణ, ఏరోస్పేస్ రంగాల్లో భారీ పరిశ్రమలు ఏర్పాటు చేయబోతున్నారు. అంతేకాదు 1,600 ఎకరాల భూమిని ఏపీఐఐసీ సేకరించింది. రూ.1,430 కోట్లతో కల్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ పరిశ్రమను ప్రారంభిస్తోంది. కల్యాణి స్ట్రాటజిక్ సిస్టమ్స్ సంస్థ ఆయుధాలు, మందుగుండు సామగ్రి తయారీలో కీలక పాత్ర పోషించనుంది. రూ.250 కోట్లతో ఎవరెస్టు స్టీల్ బిల్డింగ్స్ కంపెనీ ప్రీ ఇంజినీరింగ్ బిల్డింగ్ పరికరాలను తయారు చేయనుంది. మూతపడిన గార్మెంట్ పరిశ్రమ తిరిగి కార్యకలాపాలు ప్రారంభించడం స్థానిక ప్రజలకు ఎంతో మేలు చేసింది. ఈ పరిశ్రమ ద్వారా 2 వేల మందికి ప్రత్యక్షంగా ఉపాధి లభించనుంది. ఇది ఆ ప్రాంత ఆర్థిక వ్యవస్థకు ఊతమిస్తుంది. ఈ పరిశ్రమల ఏర్పాటుతో మడకశిర ప్రాంతం పారిశ్రామికంగా గణనీయమైన అభివృద్ధి సాధించనుంది. ఏపీ ప్రభుత్వం కర్ణాటక సరిహద్దులోని మడకశిరను రెవెన్యూ డివిజన్ కేంద్రంగా ప్రకటించింది.

## తెలంగాణ అసెంబ్లీ స్పీకర్‌కు
# హరీశ్‌రావు కీలక లేఖ




తెలంగాణ శాసనసభ స్పీకర్‌గా బాధ్యతలు స్వీకరించి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌కి మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు శుభాకాంక్షలు తెలిపారు. అయితే, ఈ రెండేళ్లలో అసెంబ్లీ నిర్వాహణలో చోటుచేసుకున్న తీవ్రమైన వైఫల్యాలు, నిబంధనల ఉల్లంఘనలపై ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు స్పీకర్‌కు ఇవాళ(ఆదివారం) బహిరంగ లేఖ రాశారు. ఈ లేఖలో పలు కీలక అంశాలను ప్రస్తావించారు. అసెంబ్లీ ప్రతిష్ఠను, రాజ్యాంగ స్ఫూర్తిని కాపాడటంలో జరుగుతున్న పొరపాట్లను ఆ లేఖలో ఎండగట్టారు హరీశ్‌రావు. శాసనసభ పనిదినాలు గణనీయంగా తగ్గిపోవడంపై అసహనం వ్యక్తం చేశారు. రూల్ 12 ప్రకారం సభా కార్యకలాపాలకు అవసరమైనన్ని రోజులు సభను నిర్వహించాల్సి ఉన్నా, అది జరగడం లేదని పేర్కొన్నారు. అలాగే, సరైన కారణాలు లేకుండా సభను తరచూగా, హఠాత్తుగా వాయిదా వేయడం సభా సమయానికి సంబంధించిన రూల్ 13తో పాటు వాయిదా పద్ధతులకు సంబంధించిన రూల్ 16లకు విరుద్ధమని తెలిపారు హరీశ్‌రావు. సభలో ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సభ్యులకు ఉన్న ప్రధాన క్వశ్చన్ అవర్, జీరో అవర్ నిర్వాహణలో నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా రూల్స్ 38 నుంచి 52, అదేవిధంగా రూల్స్ 53 నుంచి 62 వరకు ఉన్న నిబంధనలను పాటించడం లేదని ప్రస్తావించారు. సభలో మంత్రుల నుంచి నేరుగా సమాధానం వచ్చే స్టార్డ్ క్వశ్చన్స్ చర్చకు రాకుండా చేస్తున్నారని, తద్వారా రూల్ 38 కల్పించిన ప్రశ్నల సమయ హక్కును కాలరాస్తున్నారని పేర్కొన్నారు హరీశ్‌రావు. అంతేకాకుండా, ఒక ప్రశ్నకు సంబంధించి సమగ్రంగా చర్చించేందుకు, ప్రభుత్వం నుంచి స్పష్టత తీసుకునేందుకు సభ్యులకు ఉండే సప్లిమెంటరీ క్వశ్చన్స్ అవకాశాన్ని నిరాకరించడం, కుదించడం రూల్ 50 ప్రధాన ఉద్దేశానికి విఘాతం కలిగించడమేనని అన్నారు. ప్రజా సమస్యలను తక్షణమే ప్రస్తావించే జీరో అవర్‌ను కూడా ప్రతిసారి కుదించడం సభా హక్కులను దెబ్బతీయడమేనని స్పష్టం చేశారు హరీశ్‌రావు.

# తమిళనాడులో చిరుత దాడిలో ఐదేళ్ల బాలుడి మృతి

తమిళనాడులోని కోయంబత్తూరు జిల్లాలో మరో విషాద ఘటన చోటుచేసుకుంది. వాల్పారైలోని తేయాకు తోటలో చిరుతపులి దాడిలో ఐదేళ్ల బాలుడు మృతి చెందాడు. గత ఎనిమిది నెలల్లో ఈ ప్రాంతంలో చిరుత దాడిలో చిన్నారులు మరణించడం ఇది మూడోసారి కావడంతో స్థానికంగా తీవ్ర భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు, అటవీ శాఖ అధికారుల వివరాల ప్రకారం.. వాల్పారైలోని అయ్యర్పాడి తేయాకు ఎస్టేట్‌లో పనిచేస్తున్న అస్సాం వలస కార్మికుడి కుమారుడైన సైఫుల్ (5) శనివారం తన ఇంటి ముందు ఆడుకుంటున్నాడు. ఆ సమయంలో సమీపంలోని తేయాకు పొదల నుంచి ఆకస్మాత్తుగా దూసుకొచ్చిన చిరుతపులి బాలుడిని పట్టుకుని తోటలోకి లాక్కెళ్లిపోయింది.





# సారా టెండూల్కర్ వారణాసి యాత్ర.. 36 గంటల్లో ఫుల్ ఎంజాయ్!

క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ కుమార్తె సారా టెండూల్కర్ ఇటీవల వారణాసిలో పర్యటించారు. తల్లి అంజలితో కలిసి ఈ పుణ్యక్షేత్రాన్ని సందర్శించిన ఆమె, కాశీ వీధుల్లో కలియతిరుగుతూ షాపింగ్ చేశారు. స్థానిక వంటకాలను ఆస్వాదించారు. తన 36 గంటల యాత్రకు సంబంధించిన ఫోటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పంచుకోగా, అవి ప్రస్తుతం వైరల్ అవుతున్నాయి. తన కాశీ యాత్ర ఎన్నో మధురానుభూతులను పంచిందని సారా తెలిపారు. అక్కడి వీధుల్లో తిరుగుతూ ప్రసిద్ధి చెందిన బనారసీ చీరను కొనుగోలు చేసినట్లు చెప్పారు. అలాగే, తిరంగా బర్ఫీ, దహీ వడ వంటి స్థానిక వంటకాలతో పాటు మట్టి కప్పులో టీ తాగడం వంటివి మర్చిపోలేని అనుభవాలని పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా బోటింగ్ కూడా చేసినట్లు ఆమె తన పోస్టులో వివరించారు.

# నిజామాబాద్‌లో పెళ్లింట విషాదం

మరో రెండు రోజుల్లో ఓ యువకుడు పెళ్లి బంధంలో అడుగుపెట్టబోతున్నాడు. ఇంట్లో పెళ్లి పనులు కూడా జోరందుకున్నాయి. బంధువులు రావడం కూడా మొదలైంది. దీంతో ఇంట్లో పెళ్లి సందడి నెలకొంది. అంతా ఆనందంగా పెళ్లి రోజు కోసం ఎదురుచూస్తూ ఉన్నారు. కానీ ఇంతలో ఆ యువకుడు చేసిన పనితో కుటుంబసభ్యులను శోకసంద్రంలోకి నెట్టేసింది. రెండే రోజుల్లో పెళ్లి పీటలు ఎక్కాల్సిన యువకుడు తీసుకున్న నిర్ణయం పెళ్లింట విషాదాన్ని నింపింది. నిజామాబాద్ జిల్లాలో ఈ ఘటన జరిగింది. జిల్లాలోని ఎడపల్లి మండలం మంగల్పాడు గ్రామానికి చెందిన ప్రతాప్ గౌడ్ (30) పెళ్లి నిశ్చయమైంది. మరో రెండు రోజుల్లో అతడి వివాహం. కానీ ఏదో విషయంలో కుటుంబంలో గొడవలు చోటు చేసుకున్నాయి.






# నెహ్రూపై మోదీ చెప్పేవన్నీ అబద్ధాలే

దివంగత మాజీ ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూపై అబద్ధాలు చెబుతూ చరిత్రను మార్చేందుకు ప్రధాని మోదీ కుట్ర చేస్తున్నారని టీపీసీసీ కార్యనిర్వాహక అధ్యక్షుడు తూర్పు జగ్గారెడ్డి ఆరోపించారు. ఆ కుట్రలను సోనియాగాంధీ తీవ్రంగా ఖండించారన్నారు. సోనియగా, రాహుల్‌గాంధీల నాయకత్వంలో తాము సైనికుల్లా పనిచేస్తామని, వారి ఆదర్శాలను గాంధీ భావజాలాన్ని తమ భుజాన మోస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. నెహ్రూ పాలనలో జరిగిన మంచిని.. మంచి అని చెప్పే గుణం బీజేపీకి లేకపోవడం దురదృష్టకరమన్నారు.శనివారం గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో జగ్గారెడ్డి మాట్లాడుతూ.. గాంధీ, నెహ్రూలు స్వాతంత్ర్యోద్యమం నడిపారని, దేశ ప్రజలు బానిసలుగా ఉండొద్దన్నదే సింగిల్ అజెండాగా చేసుకుని ముందుకు సాగారని పేర్కొన్నారు. మోదీ ఎన్ని అబద్ధాలు చెప్పినా నెహ్రూ చరిత్ర మార్చలేరన్నారు.